# ఆశ మితిమీరితే!

— మహర్షి

ఒక ధనవంతునకు ఒకే ఒక కుమార్తె ఉండేదిది. ఆమెకు ముక్కు లేదు. అందుకే అందముగాలేక వికారముగా ఉండేదిది. అలాంటి ఆమెకు వివాహం చేయాలని ఆమె తండ్రి అనేక ప్రయత్నాలు చేశాడు. చాలామంది యువకులు ఆమెను చూచి నచ్చలేదని వెళ్ళిపోతున్నారు. ఆమె దిగులుతో బాధపడేది. తండ్రి తన కూతురిని వివాహం చేసుకున్న వారికి రెండు లక్షలు కట్నం యిస్తానని చెప్పాడు. కానీ, ధనానికి ఆశపడి ఎవరూ ముందుకు రాలేదు.

చాలాకాలం గడచింది. ఆమె తండ్రి యిచ్చే రెండు లక్షలకు ఆశపడి ఒకతను ముందుకొచ్చి ఆమెను వివాహం చేసుకున్నాడు. ధనవంతుని కుమార్తె తనకు ముక్కు లేదని, అందరూ తనని చూసి అసహ్యించుకున్నట్లు భావించి, విచారంతో ఎక్కడికీ వెళ్ళక ఇంటిలోనే తలుపులు బిగించి లోపలే కూర్చుండేదిది. రోజురోజుకు బయట వారికి కనిపించడం మానుకున్నది.



భర్త ఆమెను ఎంతో ఓదార్చాడు. అయినా ఆమె ఆ బాధనుండి బయట పడలేకపోయింది. భార్యాభర్తలిరువురు అనేక వ్రతాలు చేశారు.

అయినా ఆమెకు ముక్కు మాత్రం రాలేదు. ఒకసారి సాధువు వారికి తటస్థపడి "భగవంతుని అనుగ్రహం ఉంటే ఆమెకు ముక్కు వస్తుంది. ఇద్దరు భగవద్ధ్యానం చేయండి" అని చెప్పాడు. భర్త ఆమెకు ఒప్పించి హిమాలయాలకు తీసుకు వెళ్ళాడు. ఆమె ఎంతో నిష్ఠతో భగవంతుని ధ్యానించినది. లోక వాంఛలను ఆశించి ధ్యానం చేస్తే త్వరగా కుదురుతుందట. ఆమె భక్తి ప్రపత్తులకు మెచ్చి భగవంతుడు ప్రత్యక్షమైనాడు. ఆమెకు భగవంతుడిని చూడగానే ఆశ్చర్యం, ఆనందం పట్టలేక పోయింది. వెంటనే ఆలోచనా రహితంగా "నాకు పెద్ద ముక్కు కావాలి" అని కోరింది. దేవుడు తథాస్తు అన్నాడు. ఆమె అలా కోరడం వలన ముఖానికి మించిన పెద్ద ముక్కు వచ్చింది. మళ్ళీ భగవంతుడిని ప్రార్థించినది. మళ్ళీ భగవంతుడు ప్రత్యక్షమైనాడు. మరల ఆమె తొందరపాటుతో "నాకు ఈ ముక్కు వద్దు" అన్నది.

వెంటనే ఉన్న ముక్కు కూడా మాయమయింది.

మితిమీరిన ఆశ దుఃఖహేతువు. కావున ఆశలు తీరాలనుకున్నప్పుడు అడిగే విధానం తెలియాలి. ఒకదాని కొకటి కోరుకుని ఉన్న అందాన్ని కూడా మనం ఒక్కొక్కప్పుడు పోగొట్టుకుంటూ వుంటాం. ఏది ప్రయోజనమో తెలుసుకుని అడగాల్సిన విధంగా అడగాలి.

# లోభి — మహాలోభి

ఒక ఊరిలో లోభి, మహాలోభి అనే ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. వారిద్దరు ఏనాడు కడుపునిండా భోజనం చేసేవారు కాదు. తాత్కాలికమైన అభీష్టాలను నెరవేర్చుకోవటానికి మాత్రమే దైవప్రార్థనలు చేసేవారు. నైవేద్యం పెట్టాలనుకున్నప్పుడు ఒక కండచక్కెర ముక్కను పరమాత్మునికి చూపించి నోటిలో వేసుకునేవారు. ఎందుకంటే భగవంతుని విగ్రహం ముందు ఓ నిముషం వుంచినా చక్కెరను చీమలు తింటాయనే లోభత్వం. ఎవ్వరికీ ఎటువంటి ఉపకారం చేయని లోభులు వీళ్ళు.

ఒకనాడు ప్రక్క ఊరిలో వారి బంధువు చనిపోతే ఆ కుటుంబ సభ్యులను పలుకరించటానికి పెద్దవాడైన మహాలోభి బయలుదేరాడు. దారి ప్రయాణం బండిలో కానీ, బస్సులో కాని వెలితే డబ్బు ఖర్చవుతుందని నడచిపోవటానికి సిద్ధమయ్యాడు. చీకటిగా ఉన్నప్పుడే అన్న ప్రయాణానికి సిద్ధమవుతుంటే తమ్ముడు ఒక చిన్న దీపం వెలిగించి ఒక సంచిలో బట్టలు సర్ది ఇచ్చాడు. అన్న వెళ్ళగానే తలుపులు వేసుకుని పడుకుందామనుకుంటున్నాడు. కానీ, దీపం ఎక్కువసేపు వెలిగితే కిరోసిన్ ఖర్చు అవుతుందని, దీపం ఆర్పివేసి ఒక గూటిలో పెట్టబోయాడు. ఆ చీకటిలో వున్న తేలు అతనిని కుట్టింది.

ఆ బాధతో తమ్ముడు మూలుగుతూ పడుకున్నాడు. ఇక మహాలోభి అయిన అన్న మూడు మైళ్ళు నడిచేటప్పటికి ఏదో గుర్తుకువచ్చి ఇంటికి తిరిగి వచ్చాడు.

అప్పటికి ఇంకా తెల్లవారలేదు. తలుపుకొడుతూ 'తమ్ముడు— తమ్ముడు' అని పిలిచాడు. తమ్ముడు మూలుగుతూ లేచి తలుపు తీసి.

"ఎందుకన్నగారు తిరిగి వచ్చారు?" అని అడిగాడు.

"నాయనా" బయలుదేరి వెళ్ళేటప్పుడు చెప్పటం మరిచాను. వెలిగించిన దీపం ఆర్పావో లేదో కిరోసిన్ ఖర్చవుతుంది. ఆర్పమని చెప్పటానికి వచ్చాను అన్నాడు.

తేలుకుట్టిన బాధతో లోభి అయిన తమ్ముడు "ఎంత దూరం వెళ్ళి తిరిగి వచ్చావు" అని అడిగాడు. "మూడు మైళ్ళు" అన్నాడు మహాలోభి.

"అయ్యయ్యో! మూడు మైళ్ళు వెళ్ళడం మూడు మైళ్ళు రావడం, అంటే ఆరుమైళ్ళు. ఈ ఆరు మైళ్ళు నడవడం వలన నీ పాదరక్షలు ఎంత అరిగిపోయాయో ఆలోచించావా?" అన్నాడు తమ్ముడు.

వెంటనే మహాలోభి నేను చెప్పులు చంకలో పెట్టుకుని నడిచాను...... అంటూ మళ్ళీ ప్రయాణమయ్యాడు. అలా చీకట్లో కాళ్ళను చెప్పులు కూడా లేకుండా నడచివెళ్ళుతున్న మహాలోభి పాముకాటుకు గురి అయ్యాడు.

లోభత్వము వున్నవారికి విచక్షణా జ్ఞానము వుండదు! లోభము వలన క్షోభ కలుగును!!

*ఖర్చు*

*"అదేమిటండి... మీ సినిమా వంద రోజులు ఆడిందిగా? మరి శతదినోత్సవం జరపరా?" ఓ నిర్మాతని అడిగాడు విలేకరి.*

*"ఎందుకయ్యా బాబు! ఆ సినిమాని వంద రోజులు ఆడించటానికి అయిన ఖర్చు చాలు... మళ్ళీ శతదినోత్సవానికి ఖర్చు నేను భరించలేను" నిర్మాత జవాబిచ్చాడు.*

*— సాయిగంగాధర్ నామర్తి, విజయవాడ.*